


# అర్ధాంగి

రామచంద్రం

సుఖదుఃఖాలలో, అన్నిటా పాలు పంచుకునేవారు సతీపతులు. ఇది కేవలం ఆదర్శం మాత్రమే. కేవలం సుఖాలు మాత్రమే పంచుకుని, కష్టాలలో ఒకరినొకరు తోసిపుచ్చే దంపతులు ఉన్నారు. సుఖాలలో మాత్రమే కాక దుఃఖాలలోనూ, నీతిలో మాత్రమే కాక అవినీతిలోనూ పాలుపంచుకునేవారు ఉంటే భార్యాభర్తల అనుబంధం ఎంతటి ఆనందదాయకంగా ఉంటుందో ఎలా చెప్పడం?

"ఇక నేను లంచం తీసుకోదల్చుకోలేదు." గంభీరంగానూ, స్పష్టంగానూ అన్నాడు విశ్వనాథం.

రెండు వేలు అందించబోతున్న కంట్రాక్టర్ కరుణాకరం అతని మాటలని కేవలం హాస్యంగా తీసుకుని నవ్వేస్తూ, "మీరు చక్కటి జోకులు వెయ్యగలరే!" అంటూ ఆగాడు.

"హాస్యం కాదు, నిజమే! ఈ సాయంత్రమే నిర్ణయించుకున్నానిక లంచం తీసుకోరాదని." ఖచ్చితంగా చెప్పాడు విశ్వనాథం.

పక్క గదిలో ఏదో పుస్తకం చదువుకుంటున్న పార్వతి కూడా అతని మాటలకు తుళ్ళిపడి, కిటికీ వరకూ వచ్చి భర్త ముఖంలోకి చూసింది. ఆమెకెంతమాత్రమూ నమ్మకం కలగనట్లుంది, భర్త లంచాలు మానేశాడంటే.

గంభీరంగా కూర్చున్న విశ్వనాథాన్ని చూసేసరికి ఒక్కసారిగా కరుణాకరానికి భయమూ, ఆశ్చర్యమూ ముంచుకు వచ్చేశాయి.

బొమ్మలా రెండు గదులకీ నడుమనున్న కిటికీ వద్ద నిలబడి పోయిన పార్వతికీ విశ్వనాథం వింతగా కనిపించసాగాడు, హఠాత్తుగా ఎంతో మారిపోయినట్లు.

కరుణాకరం సంగతి సరేసరి. కలో, నిజమో తేల్చుకోలేక పోతున్నాడు. 'లంచాల పులి' అనే బిరుదాంకితుడైన

విశ్వనాథమేనా ఇలా మాట్లాడుతున్నాడు? ఇప్పటి వరకూ లంచాలు తీసుకోని మనిషి ఇవాళ లంచం తీసుకోడం ప్రారంభించాడంటే ఏమీ ఆశ్చర్యం లేదు. కాని, లంచం తీసుకుందు కలవాటుపడిన వ్యక్తి ఆ పని మానెయ్యడం — సాధ్యమేనా? సంభవమేనా? నరమాంసపు రుచి మరిగిన వ్యాఘ్రమూ, లంచం మేసే మనిషీ — అటు నుంచి ఇటు మారడం సంభవమేనా? నిమ్మకు నీరెత్తినట్లు నిశ్చలంగా కూర్చున్నాడు విశ్వనాథం. ఒక మంచిపని చేయాలన్న నిర్ణయం, లేదా ఓ చెడ్డపని మానేయడం—వల్ల కలిగే శక్తి అతని ముఖంలో కొట్టవచ్చినట్లు కనిపిస్తూంది.

ఎట్టకేలకు, ఎలాగో గొంతు పెగల్చుకుని అడిగాడు కరుణాకరం: "ఇంతకీ మీ రెందు కిలా మారి పోయారు?"

పార్వతి కూడా కుతూహలంగా చూస్తూంది కిటికీ లోంచి. కాని, విశ్వనాథం కొల్లంకొట్టిన రాయిలా కూర్చుండిపోయాడు పెదవి మెదపకుండా. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాలా, వద్దా అని ఆలోచిస్తున్నాడు. సాయంత్రం...ఆ క్షణాలలో ... దేవుడి ముందు ... తను చాలా గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఆ పట్టు ని కొంచం సడలినా మళ్లీ తను ప్రమాదంలో పడి పోతాడు. లంచంలో ఆకర్షణ చాలా ఎక్కువ. కరుణాకరం మరీ ప్రమాదకరమైన మనిషి. ఏమాత్రం అలుసిచ్చినా ముగ్గులోకి లాగేసి చదరంగంలో పావుగా చేసేస్తాడు తను.

"మీకంటె వయసులో, అనుభవంలో పెద్దవాడిని. కంట్రాక్టర్‌గా కాక, మీ శ్రేయోభిలాషిగా అడుగు తున్నాను. చెప్పండి, విశ్వనాథంగారూ! మీ రెందు కిలా నిర్ణయించుకున్నారు?"

నిజానికి కరుణాకరం స్వార్థరహితంగా ఆ ప్రశ్న వేయలేదు. మెల్లగా మాటలలోకి దింపితే విశ్వనాథాన్ని ఓడించి, మళ్లీ మామూలు మనిషిని చేసెయ్యడం అసాధ్యమేమీ కాదని తెలుసు. కరుణాకరం లెక్క విశ్వనాథానికి మాత్రం కొత్తా? నోరు జారితే అతని లెక్క తన నిర్ణయాన్ని పటాపంచలు చేసేస్తుందని అతనికీ తెలుసు. మాటలలో తను కరుణాకరాన్ని గెలవ లేడని తెలుసు. అందుకే మరింత మౌనంగా ఉన్నా డతను.

ఇప్పుడు విశ్వనాథం అడ్డం తిరిగితే తనకు కంట్రాక్టులో మిగలవలసిన పాతిక వేలూ గల్లంతే. లోగడ తను విశ్వనాథాని కెంతో ముట్టజెప్పాడు. ఎలాగో ఈ కంట్రాక్టు పూర్తి చేసుకోకపోతే ...

భయంగా, ఆత్రంగా అన్నాడు కరుణాకరం: "హఠాత్తుగా మీరెందుకింత నిరికివారైపోయారో తెలి యడం లేదు. ఎటువంటి ఏ మొప్పినా మీమీద తలగ నాలకుండా చేసేందుకు నే మున్నాను. ఒకవేళ, మీరు పాపం, పుణ్యం వంటి పదజాలపు భ్రమలో పడ్డారేమో? అది అనవసరం. బ్రతకలేని వాళ్ళు తమ అసమర్థతను దాచుకుందుకు వాడే అర్థంలేని పదాలవి. లంచం తీసుకోకపోవడం పెద్ద బ్రహ్మవిద్యేమీ కాదు. కాని, ఒకటి ఆలోచించండి. లక్షలు పెట్టుబడితో కంట్రాక్టులు చేస్తున్నాము. మీరు స్ట్రిక్ట్‌గా ఉండి ఈ మెషర్‌మెంట్ బుక్‌లో సంతకం చెయ్యక, అభ్యంతరం పెడితే మేము మట్టికొట్టుకు పోతాము. మీరూ దీని ఫలితం అనుభవించక తప్పదు.

"లంచం తీసుకోకుండా కేవలం జీతంతోనే అయితే, మీ రీ భవనం కట్టించుకోగలిగేవారు కారు. మీ అబ్బాయిని కాన్వెంట్‌లో చదివించగలిగేవారు కారు. ఇప్పు డనుభవిస్తున్న సుఖాలలో పదోవంతు కూడా ..." కొంచెం ఆగి మళ్లీ అన్నాడు కరుణాకరం. "పై సంపాదన లేకుండా ఎందరు బ్రతుకుతున్నారు? ఇది అన్యాయం అనుకోకండి. లోకం సాగుతున్న తీరుకంటె మరో న్యాయం ఏముంటుంది? ప్రపంచం యావత్తూ ఎలా నడుస్తూందో తెలుసుకుంటే ..." తన మాటలకు విశ్వనాథం లొంగి ఉంటాడన్న నమ్మకంతో ఎమ్. బుక్కు, రెండు వేలు అతని ముందుకి జరిపాడు కరుణాకరం.

తన అయిష్టం మౌనంతోనే తెలిపి, ఆఫీసు గది నుంచి బయటకు నడిచాడు విశ్వనాథం, కరుణాకరం ముఖం చూడకుండా.

తిన్నగా పడక గది చేరుకుని, టేబుల్ మీద పెట్టిన భగవద్గీత అందుకోబోతూంటే, అంతవరకూ కిటికీ దగ్గిర బొమ్మలా నిలబడిన పార్వతి, భర్త ఎదురుగా వచ్చి చిరునవ్వు నవ్వింది.

వెన్నెలలాటి ఆ చిరునవ్వులో, శారీరక సాంత్వనకాక మానసికంగా ఏదో చల్లదనం లభించినట్లయింది విశ్వనాథానికి.

అతని చేతిని తన చేతిలోకి తీసుకుని మెల్లగా అడిగిం దామె: "చెప్పండి. అసలేం జరిగింది?"

ఆమె స్పర్శలో అతనికి చిత్రమైన శాంతి లభిస్తూంది.

మృదువైన ఆమె ప్రశ్నలో అతనికి మధురమైన భవిష్యత్తు ఆహ్వానం చేయబడుతున్నట్లు తోచింది.

"దేని గురించి, పార్వతీ?" అడిగాడు విశ్వనాథం.

"మీరు లంచం తీసుకోనని నిర్ణయించుకున్నారుగా? కరుణాకరంతో మీ మాటలు నేను విన్నాను."

"అది అనవరం అనుకోను, పార్వతీ. అన్నివిధాలా అర్థాంగిని. నా మనసులో భాగం నీది. చెప్పక తప్పదంటే చెప్తాను."

"చెప్పండి." అతని చెయ్యినిడువకుండానే అం దామె. "అవసరమైతే నా సహకారం ఉంటుంది మీ నిర్ణయానికి."


చాలా సంతోషంగా, ఆశగా అన్నా డతను: "నాకు తెలుసు, పార్వతీ, నువ్వు చాలా మంచిదానివి. తెలివైనదానివి. గతించిన జీవితంలో నే నేమాత్రమైనా శాంతినీ, సుఖాన్నీ అనుభవించానంటే అది కేవలం నీ కారణంగానే. నీ విద్యతో, తెలివితేటలతో నన్ను సుఖపెట్టడానికి నువ్వు..."

"సరే. అసలు విషయం చెప్పండి."

"సాయంత్రం ..." కళ్ళు మూసుకుని సోఫాలో వెనక్కి వాలుతూ అన్నాడు విశ్వనాథం. "సాయంత్రం షికారు బయల్దేరాను. రోడ్డుమీద మెల్లగా నడుస్తున్నాను.

'బాబూ, ఓ రూపాయివ్వరూ?'

"చిత్రంగా వినిపించి చూశాను. పదేళ్ళుంటాయేమో ఆ కుర్రాడికి. అందరిలాగా పైసో, పరకో కాకుండా రూపాయడిగాడు! 'రూపాయతో ఏం చేస్తావేం?' అని కుతూహలంగా అడిగాను. ఆ కుర్రాడు నా సిల్కు చొక్కా వైపు అమాయకంగానూ, జేబు లోంచి కనబడుతున్న నోట్ల వేపు ఆశగానూ చూస్తు



భారత ప్రజానేత

చిత్రం—ఎమ్. ఖాదర్ బాషా (మద్రాసు–17) ▶



డు. ఆ పసివాడిని చూస్తే జాలి వేస్తోంది.

'మా నాన్నకి మందు కొంటాను.'

ఆ జవాబుతో నా జాలి చాలా ఎక్కువైపోయింది. కూ తెలుసు, పార్వతీ! ఆఫీసులోనూ, లంచం దగ్గరా ప్పుడే నేనూ మనఃస్ఫూర్తిగా ప్రవర్తిస్తానీ, నాకూ మమందనీ, దానిలోనూ కొంతెం మంచితనం ందనీ.''

''ఎవరు కాదనగలరు? చెప్పండి.''

''మా నాన్నెక్కడని అడిగాను.

'రండి, చూద్దురుగాని' అంటూ ఆ కుర్రాడు ం తీశాడు. అయిష్టమనస్కంగా నడిచాను నేను.

ఒకటి రెండు మలుపులు తిరిగి, దుర్గంధపూరిత మైన కాలువగట్టుమీద ఓ గుడిసె ముందుకి చేరు న్నాను కుర్రాడి వెంట.

'నిన్ను చూడ్డానికి ఎవరో వచ్చారు, నాన్నా!' మని ఎక్కడికో వెళ్ళిపోయాడు నన్నక్కడికి తీసుకు చ్చిన కుర్రాడు.

అడుగు లోపలకు వెయ్యలేక అక్కడే ఆగిపోయాను.

ఉన్న దొక్కటే గది. దాన్ని గది అనడం నిజమైన ది కించపరచడమే అవుతుంది. ఆ గదిలో ... తాళ్ళ ూడిన నులక మంచంమీద ఓ అస్థిపంజరం పడుంది. ఓ మూలగా ఆ అస్థిపంజరం తాలూకు అర్ధాంగి కాబోలు ముడిచిపెట్టుకు కూర్చుని, విషాదంగా మూలుగుతూంది.

ఆ గదిని నేను వర్ణించలేను. అణువణువునా దరిద్రం తాండవమాడుతూంది. సాయంత్రపు వేళ అయినా చీకటి ఆవరించుకుందక్కడ. ఆ చీకటిగదిలో... పేదరికపు గద్దుమదయ్యాలు ... జీవితపు భయంకరమైన దృశ్యాలను చూపిస్తూ, గాలిలో ఊగులాడుతూ అదరగొడుతున్నాయి.

నాకు భయం వేసింది-ప్రేతకళవంటి ఆ వెలుగులో ఉండటానికి. నాకు జుగుప్స కలిగింది—ఆ దరిద్రాన్ని కళ్ళారా చూడడానికి.

ఆ వాతావరణంలో..ఆ గదిలో ఉండడం కంటె మనిషికి మరో దుర్భర శిక్ష అవసరం లేదేమో! ఎలాగో నిగ్రహించుకున్నాను.

'నన్ను చూడాలని వచ్చారా? ఎవరు, బాబూ, మీరు? నా టైములో కంట్రాక్టులు చేసేవారా? అయినా అదేనాటి మాట?' అస్థిపంజరం ఉప్పెనలా ప్రశ్నలు కురిపించింది.

నేను జవాబివ్వలేను, కాదనలేను. పాడునూతిలోంచి, మృత్యువు లోతుల్లోంచి విన వచ్చిం దా స్వరం.

ఎక్కడినుంచి వచ్చిందో అంత ఓపిక! ఏ రకంగానో ఏమో! అస్థిపంజరం పర్నిస్తున్నట్లే తన ఆవేదన ఒలకబోయసాగింది.

'మీరు పొరబడలేదు, బాబూ! ఆనాటి ఇంజనీర్ నే... శేషరావ్ని. నేను మారిపోయాను కదూ? అవును మరి. పల్లిని నలిపినట్లు నలిపేసింది కాలం నన్ను. కాలం మార్చేసింది నన్ను- నన్ను గుర్తుపట్టలేరు మరి.

'ఆ రోజుల్లో ... నేను ఇంజనీర్ శేషరావ్ని. ఎంత అధికారం చలాయించేవాడిని! కంట్రాక్టర్ల మస్తకం మీద కరాళ నాట్యం చేసేవాడిని. నా బుర్ర ఎంత అమోఘంగా రూల్స్ చెప్పేదని! రూల్స్‌తో భయపెట్టి నాలుగు జేబులు నింపుకుందుకే. అప్పుడు నాకు క్షమ అనేది ఉండేది కాదు. మనిషిలా ప్రవర్తించానా అసలు? ఎంతసేపూ ఒకటే ధ్యాస. డబ్బు!

డబ్బు మహా పాపిష్టిది. మనిషిలోంచి మనసు మైనస్ చేసేస్తుంది. పశువుని చేసేస్తుంది. కళ్లకు పొరలు కప్పేస్తుంది. ధనదాహానికి అంతనేది ఉండదు. గుక్క గుక్కకీ ఎక్కువ కావడమే.

నే నారోజుల్లో పనిచేశానా అంటే—లంచంకోసం!

లంచం అనేది అదో పెద్ద ఊబి. ప్రపంచాన్ని మోసంచేసి అన్యాయంగా బాగుపడిపోదామంటే—ఆ కీడు కొట్టకుండా ఊరుకుంటుందా? పథం తప్పిన జీవితం పట్టాలు తప్పిన బండికాక ఏమౌతుంది? మన మేదో ప్రయోజకులమని గర్వపడతాం కాని, మరుక్షణమే శృంగభంగం ఎదురవుతుందని గ్రహించలేము. పైలా పచ్చీసుగా తిరిగేవాడిని. కంట్రాక్టర్ల పంచులలోంచి నా జేబులోకి ప్రవహించే డబ్బుకి లెక్కా, జమా ఉండేది కాదు. అన్యాయార్జితంతో విందులు కుడుచగానే సరా? ఆ పాపం బెడిసికొట్టదూ?

రత్నాల గని అనుకుని అగాధంలో పడ్డాను.

ఇంటెలిజెన్స్ వాళ్ల చేతుల్లో పడ్డాను.

ఒక్కసారి జీవితం క్లయిమాక్స్ నుంచి బేథోస్‌లోకి జారిపోయింది.

సస్పెన్షన్ ... జైలుశిక్ష...ఊస్టింగ్...

చేసిన అన్యాయాలను కాపాడుకుందుకు చేసిన ప్రయత్నాలలో స్వార్జితం యావత్తూ ఖాళీ.

గుడ్డిలో మెల్ల. జైలుశిక్ష నాలుగేళ్లే.

బయటపడ్డాను. మనిషిగా బ్రతకాలనుకున్నాను.

నేరస్థుడన్న ముద్ర పడనంతవరకే ఏ మనిషికైనా విలువ. ఒకసారి ఆ ముద్ర పడితే, అది చెరగదు; మాయదు. మనిషి దుస్స్వభావానికి లోనైనంత సులభంగానూ, త్వరగానూ దాన్నుంచి బయటపడలేడు. ఈ సత్యం నాపట్లే నిరూపించబడింది.

జైలుముద్ర నన్ను విడువలేదు. గతంలో చేసిన నేరాలకు శిక్షపడటం ప్రారంభించింది.

పొట్ట గడవటంకోసం ఎన్ని పాట్లు పడ్డానో! మూటలు మోశాను. రిక్షా లాగాను. మనిషిని పీడించుకుతిన్న మనిషిని. కాలం ఊరికే దయతలుస్తుందా? రిక్షా లాగడం ఆరంభించిన కొన్నాళ్లకే జ్వరం పట్టుకుంది. అది దేనిలోకి దించిందో! వెలతిరబడి ఈమంచమే గతి. మరో జన్మ అవసరం లేకుండా, ఈ జన్మలో చేసిన నేరానికి జన్మలోనే అనుభవిస్తున్నాను. ఈ వ్యాధి చివరకెలా దారితీస్తుందో? ఏ శిక్షకైనా అర్హుణ్ణే నేను.

ఊహ ఊళ్లేలితే కర్మ గాడిదలు కాసిందట.

నన్నపానె ట్వైవ్—ఎలా బ్రతికాను? ఇప్పుడు...

నాలుగు రోజులై పొయ్యిలో నిప్పు రాజెయ్యలేదు.


అర్ధాంగి అన్నీ తలుచుకుని అలమటిస్తూంది.

నా కళ్లముందే పిల్లడు అడుక్కుతింటున్నాడు.

ఈ మంచంమీద నిస్సహాయంగా పడుకుని అన్నీ నా కళ్లతో చూడవలసి రావడం — ఇంతకంటె దారుణమైన శిక్షేం కావాలి?

నన్నపానె ట్వైవ్ వందరూపాయలంటే ఆఫ్టరాల్! ఇప్పుడు—పైసా ఉంటే కుర్రాడికి సెనగలేనా దొరుకుతాయని ఆలోచిస్తున్నాను. చూడండి, ఎంత వ్యత్యాసమో! నిజానికి వర్తమానంకంటె గతమే ఎక్కువ బాధిస్తూంది. పశ్చాత్తాపం రోగం కంటె ఎక్కువగా నా నరాలను నమిలేస్తూంది.

ఆ ఇల్లాలు చూడండి. కన్నీటితో నన్ను కాపాడగల నేమో అని ప్రయత్నించి, ఉన్న కొంచం ఆర్ద్రతనూ పోగొట్టుకుంది!



చెట్టూ గుట్టా — ఫోటో—'భరద్వాజ' (మద్రాసు-18)

నన్ను బ్రతికించుకుందామని బిచ్చమెత్తుతున్నాడు కొడుకు! నేను చేసిన నేరానికి... నా బుద్ధి గడ్డి తిన్నందుకు ... నాతోపాటు నా వాళ్లు కూడా శిక్ష అనుభవిస్తున్నారు.'

ఇక చెప్పలేకపోయింది అస్థిపంజరం.

నేనూ వినలేకపోయాను.

ఆ దారిద్ర్యపు భయంకర ప్రతిచిత్రాన్ని చూడలేక పోయాను. నా మెదడులోని ఆలోచనలలోని దుర్మార్గత్వాన్ని భరించలేకపోయాను. ఐదు రూపాయల నోటు జారవిడిచి, ఎలాగో బయటపడి, ఏకాంతంలోకి పరుగెత్తాను.

వశం తప్పి ఆలోచనలు సాగిస్తూ నన్ను కంపితుని చేయసాగింది మెదడు.

గతంలో శేఖరం ఏమిటో — వర్తమానంలో నేను.

నేటి శేఖరం ... భవిష్యత్తులో నేను ...

విషపు ముల్లు వంటి ప్రశ్నార్థకం.

నేను చాలా సుకుమారుడిని. శిక్ష అనుభవించలేను.

అందుకు ... శిక్ష తప్పించుకోవాలంటే, నేరం చెయ్యడం మానెయ్యడమే గత్యంతరం. అదే పరిష్కారం.

అలా నిర్ణయించుకున్నాక మనసు తేలికపడింది.

మరోసారి నిశ్చయంగా అనుకునేసరికి హృదయం నిర్మలమైంది. ప్రశాంతత లభించింది.

నేరంచేసి సుఖపడటం కంటె, నేరం చెయ్యకుండా బాధపడటమే మేలు. ఏం, పార్వతీ! నువ్వు చెప్పు... నా జీవితంలో భాగం నీది. నా సుఖంలో పాలు నీది. నీ సహకారం లేకపోతే నేను సుఖపడలేను. చదువుకున్నదానివి. అర్థంచేసుకో గలిగినదానివి. నా నిర్ణయానికి బలం చేకూర్చవూ? పేరాశలకు పోక, ఉన్నంతలోనే సుఖంగా బ్రతకడానికి ... ఏం, పార్వతీ ..." ఆవేదన పడుతున్నాడు విశ్వనాథం. అతని గొంతు గద్గదికంగా ఉంది.

కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దంగా ఉండి మెల్లగా అందామె: "సరే."

విశ్వనాథం ఆనందానికి మేరలేదు. "బ్రతికించావు, పార్వతీ. ఇక ఈ చేతులతో లంచంపట్టను. పాపిష్టి సొమ్ము ముట్టను."

చిరునవ్వు నవ్వింది పార్వతి. "మీ జీవన సహచరిని నేను. మీ మనసెరిగి శాంతి చేకూర్చడం నా కర్తవ్యంకాదూ? ఇక ఎన్నడూ మీ చేతులతో మీరు లంచం తీసుకోకండి."

● ● ●

ఏడాది తిరిగింది.

విశ్వనాథం లంచం తీసుకుంటే ఓ పదివేలో, పదిహేను వేలో సంపాదించగలిగేవాడేమో ఈ వ్యవధిలో.

ఇప్పు డతను నిజంగానే లంచం ముట్టడం లేదు. కాని పార్వతి బ్యాంక్ బాలెన్సు యాభైవేలు పెరిగిందీ ఏడాదిలో.

ఇప్పుడు కంట్రాక్టర్లు నేరుగా పార్వతితోనే వ్యవహారాలు ముచ్చటించి, ఆమెకే ఫీజులు చెల్లించుకుంటున్నారు. చదువుకున్నదీ, తెలివైనదీ కనక ఆ వ్యవహారాలన్నీ బాగా చక్కబెట్టుకో గలుగుతూంది ఆమె.

ఇంటెలిజెన్స్ వాళ్లు కాదుకదా, బ్రహ్మరుద్రులు వచ్చినా విశ్వనాథం చేతులకు బేడీలు వేయలేడు. అతన్ని నేరస్థుడనలేడు. ప్రభుత్వ యంత్రాంగంలోనున్నూ ఈ మంత్రాంగంలోనూ అతను కేవలం నిమిత్తమాత్రుడు! చాలా బాధలూ, బాధ్యతలూ అతని అర్ధాంగివే! అతని పేరిట ఏమాత్రమూ ఆస్తి లేదు. అందుకే అతనికి ఏ చింతా లేదు.

విశ్వనాథం సుఖపడుతున్నాడు. ★